# ముష్టివాడి కొడుకు

"నే సెబితే యిన్నావ్‌గాదే పిచ్చమ్మా -- దొర కొడుకెప్పుడూ దొరే కావాల - ముష్టి నాయాల కొడుకెప్పుడూ ముష్టాడే అవుతాడే! అదంతే మరి-దానికి తిరుగు లేదిక --" కుంటికాలవటంవల్ల కర్రపోటుతో ముందుకు నడుస్తూ అన్నాడు చింపిరాయ్.

"ఎ హే -- నువ్వొకింతసేపు నోరు మూసుకో మావా పెతి దానికి యింతే నువ్వు, ఆ కాలం పోనాది. రాజు కొడుకులే రాజులవాలని, మంత్రిగోరి కొడుకులే మంత్రులవాలని, అదేమీ పనికిరాదు. ఈ కాలంలో", - పట్టపగలు విరగబడుతున్న ఎండ, ఎండలోని తీక్షణం ఆమె గుడ్డి కళ్ళకి చీకటిగా కనపడటంవల్ల, చింపిరాయ్ భుజం మీద చేయి ఆసరాగా వేసి నెమ్మదిగా నడుస్తోంది పిచ్చమ్మ.

"నీ కేదీ తెల్దే, పిచ్చి పిచ్చమ్మా, నోకం సంగతి నీ కేటి తెలుసు, నాను సెబుతాను యినుకో. రోజూ ఈరిగాడు, ఆడు పన్జేసే ఓటేల్లో అందరూ మాట్టాడుకునేది యింటుంటాట్ట ఆడే మనలోంటాళ్ళందరికీ నోకజ్ఞానం సెపుతుంటాడు. ఆడేం సెప్పాడో తెలుసా, రాజ్యాలు పోయినా, రాజులు పోయినా ఆ పద్ధతేం మారలేదట. మంత్రిగోరబ్బాయిలూ, సుట్టాలే మల్లా మినిట్టర్లవుతుండారంట. చినిమా వోళ్ళ పిల్లలే మళ్లీ చినిమాల్లో చేరిపోతారంట. పెద్ద పెద్ద యాపారం చేసేవోళ్ళ పిల్లలే, మళ్లీ ఆ యాపారంలో దిగబడి పోతారంట. డబ్బులున్నోళ్ళకే మల్లీ డబ్బు సంపాయించటం కుదుర్తుందంట. మనతోటోళ్ళు ఎప్పుడూ యిట్టాగే వుండిపోవాలంట. కనక -ఆ మాటయిక అనబోకు. దేవుడు, మనకొడుకు ఆడేదో సదూకోవాలనీ. ఉద్దేగాలు సేయాలనీ అంటావేటే ఎర్రిమొగవా...."

"ఏమో మావా, నీకున్నంత నోకజ్ఞానం నాకు లేదు. అయినా దేవుడు యింకా సదవాల్సిందే, వుద్దేగం సేయాల్సిందే. ఆడికి సదువంటే బోలెడు యిట్టం మావా. అక్కడా, యిక్కడా అచ్చరాలు నేర్చుకుని, ఏదో రాత్తుంటాడు ఎప్పుడూ. ఆడి తెలివీ, ఆ సురుకూ, ఎంతమంది కుంటుంది మావా. ఆడు మాత్తరం నా కంటంలో పాణం వుండగా ముష్టికి పోకూడదు. ఆడికా కర్మేంటి మామా, కాలూ కళ్ళూ మనలా కాకుండా సక్కగా వున్నవాడు.

ఆడు ముట్టెత్తుకోవటం ఏటి?"

పెద్దగా నవ్వాడు చింపిరాయ్ - "ఆడు పుట్టినప్పుడే నే సెప్పినా, ఆడికి ఏ పిచ్చి సన్నాసో, ఎర్రి నాగన్నో అని పేరు పెడదామె అంటే కాదు కూడదన్నావ్. దేవుడు అని పేరు పెట్టావ్. అందరూ నవ్వుతున్నారు - చింపిరాయ్ కొడుకు దేవుడేటి అని. నేనప్పుడే సెప్పలా, ఆడికే కాలో చెయ్యో పుట్టిన్నాడే తీసేస్తే ఆడు హాయిగా ముట్టెత్తుకొని బువ్వ తినేవోడని. నువ్వూరు కొంటేనా -'ఆడి మొగం సూడు మామా, సిన్న సిన్న చేతులు, సూడు మామా,' అని కతలు-కతలు సెప్పావ్ గాదంటే. ఆడికి సదువెందుగ్గాని, ఆడ్నీ ఎలాగోలా ముట్టెత్తు కోటం నేర్చుకోమను. ఆడికీ ఓ బతుకు దెరువు సూపించినట్టుంటాది---"

"ఛ-నోరుముయి మావా - నీకేటి తెల్దు!" సణిగింది పిచ్చమ్మ.

"అదిగో, అయిదరాబాదు బస్సు వస్తుండాది, పద పద, నాలుగు డబ్బుల్దొరకాలంటే ఆడే"- గబగబా కర్రతో నేల మీద కొడుతూ ముందుకు అడుగులు వేశాడు చింపిరయ్య. అతని ఆసరాగా తనూ గబగబా అడుగులు వేసింది పిచ్చమ్మ.

బస్సులోకి అడుగుపెట్టిన చింపిరాయి మామూలు ప్రకారం, "బలి బలి బలి బలి దేవా" అంటూ పాట ఎత్తుకోలేదు. ఆసక్తిగా చూశాడు.

"యా - యు ఆర్ కరక్ట్ ఎల్ సీ --" అంటున్నాడు భారతదేశం చూట్టానికి సతీ సుతా సమేతంగా వచ్చిన అమెరికన్ - తనని అనుకుని సుఖంగా కూర్చున్న ఎలిజబెత్ అనబడే ఎల్ సీ అను తన భార్యతో.

ఆమె నవ్వింది. నవ్వుతూనే తల వూపింది. ప్రక్కనే వాళ్ళ యిద్దరు పిల్లలూ, యిద్దరూ అయిదేళ్ళ లోపువారే-వాళ్ళల్లో వాళ్ళే మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు. వెనక సీటులో యిద్దరు. ఒక ఖద్దరు లాల్చీ అయన. ఆయన ప్రక్కనే ఒక పట్టుచీర కట్టుకున్న ఆయన భార్య కూర్చుని వున్నారు. ఆవిడ ఆ పిల్లలవేపు చూసి నవ్వుతున్నది. వాళ్ళతో మాట్లాడాలని ఆమె తాపత్రయం. కాని వాళ్లు మాత్రం ఆవిడ సంగతి పట్టించుకోకుండా, ఏదో ఆడుకుంటున్నారు. పక్కనే వున్నసంచిలో నించి నాలుగు జామపళ్లు తీసి ఆ పిల్లలకు యివ్వబోయింది ఆవిడ. ఆ యిద్దరు పిల్లల్లోను చిన్నవాడు బిత్తరపోయి చూశాడావిడవేపు. వెంటనే ఆవిడ సంగతి పట్టించుకోకుండా, తన ఆటల గొడవలో పడి పోయాడు. పెద్ద పిల్లాడు "నో థాంక్యూ" అన్నాడు.

"తీసుకో బాబూ, వద్దనకూడదు---" అంటున్నది పట్టుచీర ఆవిడ. ఆ ఎర్రజుట్టు, నీలం కళ్ళు. ఆమెరికన్ పిల్లవాడితో.

"తెలుగులో చెబితే వారికి అర్థంకాదే సావిత్రీ. యింగ్లీష్‌లో చెప్పాలి. టేకిట్ బాయ్- టేకిట్" అన్నాడు ఖద్దరు లాల్చీ ఆయన చిన్నప్పుడెవరో చెప్పిన యింగ్లీషు మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ.

అతను నవ్వాడు, "నో, ఐ డోంట్ వాంట్!", అన్నాడు ఆ పిల్లవాడు.

ఎల్ సీ, సదరు అమెరికన్ భర్త తమ పిల్లవాడివేపు తృప్తిగా చూశారు. ఎల్ సీ మాత్రం

పట్టుచీర ఆవిడ వేపు చూసి స్నేహ పూర్వకంగా నవ్వింది.

"నడిరేయి ఏ జాములో-" అంటూ పాడుతూ ముందుకు వచ్చిన ఒక ముష్టి కుర్రవాడూ, అతనితో పాటుదాదాపుగా అతని అంతే వయసువున్న ఒక చిన్నపిల్ల - అంటే ఆరేళ్ళ వయసుంటుందేమో యిద్దరికీ - పట్టుచీర ఆవిడ వద్ద ఆగారు.

చింపిరాయికి తెలుసు ఆ యిద్దరు పిల్లలూ, ఆ పిల్లకి కళ్ళూ, చెవులూ, ముక్కు అన్నీ కలిసి ముద్దగా వుంటాయి. ఏదో చిన్న చిన్న రంధ్రాలు లాగా తప్ప ఏ అవయవమూ సరిగ్గా వుండదు. ఆ పిల్ల అలా, ఎలా బ్రతుకుతున్నదో కూడా చెప్పటం కష్టం. వాళ్లు యిద్దరూ కవల పిల్లలే అని, వాళ్ళు పుట్టేటప్పుడే. పురిట్లోనే వాళ్లమ్మ, అంతకు కొద్ది రోజులు ముందుగా వాళ్ల నాన్న పోయారని చెప్పుకుంటారు. అప్పట్నించీ వాళ్లు అలానే గాలికి పెరిగారు. యిలా అడుక్కుతింటూ తన చెల్లెల్ని పోషించవలసిన దుస్థితి ఆ పిల్లాడికి అంత చిన్న వయసులోనే కలిగింది. వాళ్ళని చూస్తే చింపిరాయికి చెప్పలేనంతజాలి.

ముష్టెత్తుకోవటంలో కూడా కొన్ని మెలికలు వున్నాయి. అలా ఒకే బస్సులో ఒకేసారి యింత మంది ముష్టివాళ్ళు వస్తే, బస్సులోనివాళ్ళు ఎవరికో ఒకళ్ళకి మాత్రమే వేస్తారు. కాని, అందరికీ వేయరు. అందుకే చింపిరాయి, ఆ పిల్లవాళ్ళకి అడ్డురాదలచుకోలేదు. అక్కడే నుంచున్నాడు. అటే చూస్తున్నాడు.

"అడుక్కుతినే ఎదవ బతుకు తల్లీ, దరమం సేయండమ్మా, మరీ పసిపాపలం తల్లీ, మీ పిల్లల్లాంటోళ్ళం అమ్మా, పొద్దుటాలనుంచీ ఏమీ తినలేదు. ఓ పైసా దరమం సేయండి తల్లీ-" పట్టు చీర ఆవిడను బ్రతిమలాడుతున్నాడు ముష్టిపిల్లవాడు. ముష్టిపిల్ల లోపలకు పీక్కుపోయిన పొట్ట మీద పుల్లల్లాంటి తన చేతులతో టపటపా మద్దెల కొడుతున్నది.

"ఛీ - అవతలకు ఫో - వెధవగోల. అడుక్కుతినకపోతే ఏదన్నా పనిచేసుకో కూడదూ!" కసిరింది పట్టుచీర ఆవిడ.

ఖద్దరు చొక్కా ఆయన వీళ్ళిద్దరివేపూ అసహ్యంగా చూశాడు.

పట్టుచీర ఆవిడ అమెరికా పిల్లవాళ్లతో అంటున్నది -

"టేకు యిట్టు బాబూ, టేకు యిట్టు!" అని.

వాడు నీలం కళ్ళ మీద ఎర్రటి కనురెప్పలను టపటపా ఆర్పి - "నో, ఆంటీ" అన్నాడు.

"అది బాడ్, టేక్ యిట్ బాయ్" ఖద్దరు లాల్చీ ఆయన ఆ కుర్రాణ్ణి బ్రతిమిలాడుతూ, అతని చేతిలో జామకాయలు పెట్టబోయాడు.

ఆ జామకాయల వేపే ఆత్రంగా, ఆకలిగా చూస్తున్నారు ముష్టిపిల్లలు ఇద్దరూ.

"నో అంకుల్, ఉయ్ డోంట్ వాంట్ దట్" అంటూనే చేయి విదిలించుకొని. అటుతిరిగి వెంటనే ఏదో ఆటల్లో పడిపోయారు ఆ అమెరికన్ పిల్లలిద్దరూ.

"ముద్దుగా వున్నారుకదా అని ఇవ్వబోతే తీసుకోరేం వెధవలూ-" సణిగింది ఆవిడ.

"ప్రొద్దుటినించీ ఏమీ తినలేదమ్మా. కళ్లు తిరుగుతున్నాయి అమ్మగారు-" అంటున్నారు ముష్టి పిల్లలు.

"ఛా - వెధవ సంత! తిండికి వేళాపాళా లేదూ!" అంటూనే ఒక పండు తన చేతిలో వుంచుకొని, మిగతావన్నీ ప్రక్కనేవున్న బుట్టలో పడేసింది. తన చేతిలోని పండును కసుక్కున కొరికింది. ఆ ముష్టివాళ్లవేపు కళ్లురిమి చూసింది.

"ఏటి మామా ఆగావ్-పద!" అన్నది యిప్పటి దాకా ఏంజరిగిందో తెలీని గుడ్డి పిచ్చమ్మ.

"పద..... ముందుకు కాదు వెనక్కి-బస్సు దిగుదాం."

"ఏం ఎందుకు?" అన్నది బస్సు దిగుతూ పిచ్చమ్మ.

"ఎవరో తెల్లాళ్ళు, ఒ'గానే వున్నాళ్ళు- వద్దన్నా యినకుండా ఆళ్ళ చేతుల్లో ఆ పళ్ళు పెడతావుంది ఆ ఎనక కూసున్నావిడ. కానీ ఆకలేసి సత్తావున్న యిద్దరు పసికూనల్ని కసురుకుంటోంది. ఇదేనే లోకంతీరు. ఉన్నాళ్ళకే అన్నీ - లేనోళ్ళకేంలేదు పద!"

పోతూ పోతూ ఆ దృశ్యం చూసిన చింపిరాయ్ హృదయం కలుక్కుమంది. పట్టుచీర ఆవిడ జామకాయ ముక్కలు కొరికి బయటకు వుమ్మేస్తోంది. అవి ఏరుకు తింటున్నారు ముష్టిపిల్లలు, చాలా ఆతృతగా, ఆకలిగా.

గబగబా దగ్గరకు వెళ్లి, తన డబ్బాలోవున్న పధ్నాలుగు పైసల్లోనూ పది పైసలు వాళ్ళ డబ్బాలో పడేశాడు, ఏమయినా కొనుక్కుతింటారనే వుద్దేశ్యంతో. వాళ్లు కృతజ్ఞతగా చూసిన చూపు చింపిరాయి కడుపులో అంతకుముందు రోజు నుంచీ గూడుకట్టుకున్న ఆకలినంతా, ఒక క్షణంలో తీర్చేసింది.

యధావిధిగా చింపిరాయి ముందు నడుస్తున్నాడు. అతని చేయి ఆసరాగా గుడ్డి పిచ్చమ్మ మెల్లగా నడుస్తున్నది.

చింపిరాయి 'బలి బలి బలి దేవా!' పాట పాడకుండా నిశ్శబ్దంగా నడవటం పిచ్చమ్మకు ఆశ్చర్యంగావుంది. అదే ఆడిగింది చింపిరాయిని.

అదోరకంగా నవ్వాడు చింపిరాయి. ఒక క్షణం మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా అన్నాడు "నువ్వు సెప్పింది అచ్చరాల నిజమేనే పిచ్చమ్మా, మన దేవుడు - కాలూ, సెయ్యీ, కన్నూ, సెవీ, అన్నీ మంచిగా వున్నవాడు. ఆడు అడుక్కుతినకూడదు. ఆడు సదూకోవాలి. వుద్దేగం సేయాలి. ఆడ్ని నా కంటంలో ప్రాణం వుండగా అడుక్కోనీను, సూత్తావ్‌గదా!"

అలా అంటున్నప్పుడు అతని స్వరంలో ఏదో దృఢనిశ్చయం వినబడింది పిచ్చమ్మకు.

ఆమె ముఖం వికసించింది. హృదయమంతా చల్లని వెన్నెల పరచుకున్నట్టు, హాయిగా అనిపించింది. తన చేతిలో వున్న చింపిరాయి చేతిని మృదువుగా, ప్రేమగా నొక్కింది.

"మంచిమాట సెప్పినావ్ మావా! ఆడు మనలా అడుక్కు తినకూడదు. సక్కంగా సదూకోవాలి. వుద్దేగం సేయాలి. దేవుడు నిజంగా దేవుడనిపించుకోవాల!" సంతోషం పట్టలేక పోతున్నది పిచ్చమ్మ. అప్పడే తన కొడుకు మామూలు ముష్టివాళ్ళ కొడుకు చదువుకుని ఉద్యోగం సంపాదించి గొప్పవాడయినంత ఆనందం అనుభవిస్తున్నది.

"మనకు తిండిలేకపోయినా పరవాలేదు. పత్తులుంటాం. కాని దేవుడు సదూకోవాలి. అణ్ణి బళ్లో ఏయాల!" మళ్ళీ అన్నది. ఆమె గుడ్డి కళ్ళల్లో మెరుపేదయినా మెరిసిందేమో కానీ -- బయటకు మాత్రం కనబడదు. చింపిరాయి ఆమె వేపు అదోలా చూశాడు - అతని కళ్ళల్లోనూ ధృఢ నిశ్చయం కనబడింది.

వారం రోజుల తర్వాత - దేవుణ్ని బడిలో వేద్దామని అనుకుని చేసిన ప్రయత్నాలన్నీ పూర్తిచేసుకుని, ఉసూరుమంటూ, కూలబడుతున్న చింపిరాయి దగ్గరకు చేరింది - పిచ్చమ్మ.

"ఏటి మామా - ఏటయింది"-

చింపిరాయి ముఖం ఎర్రనయింది. కాసేపు మాట్లాడలేదు. తర్వాత కాసేపు తనలో తనే సణుక్కున్నాడు. తర్వాత మెల్లగా అన్నాడు.

"ఇది డబ్బున్నోళ్ళ నోకమే. ఒక బళ్లో డబ్బడిగినారు బళ్లో ఏసుకోటానికి, మరి పెబుత్వం డబ్బు తీసికోవద్దని సెప్పిందిగదా, అదే అడిగినా అది ఫీజు కాదంట, లంచమూ కాదంట. అది బడికి యిరాళంట. పది రూపాయలు కావాలంట. పది రూపాయలేనాడన్నా కంటితో సూశామా, యింకోటి యింగిలీసు బడంట. అసలు నోపలికే రానీయలేదు. ఇంకో బళ్లో అయన ముకం మీదనే తిట్టాడు. నీలాంటి ముష్టాల్ల కొడుకుల్ని బళ్లో ఏసుకుంటే మా బడి పరువు పోతుందన్నాడు. మిగతా పిల్లలు సెడిపోతారన్నాడు. ఇంకో బళ్లో పుట్టిన చట్టిఫికేటు కావాలన్నారు. ఆడేమన్నా అసుపత్రిలో పుట్టాడా, మంతరసానొచ్చిందా! ఏడనుంచొత్తది ఆ చట్టిఫికేటు. ఈ నోకంలో బతకటానికి, పుట్టినట్టు దాకలా కావాలా ఏందీ? ఇంకో ఆయన ఏం సెప్పినాడో తెలుసా! ఆడి తరగతి పుస్తకాల కరీదు పది రూపాయలంట. ఇదేదన్నా పెద్ద చదువేటే అన్ని పుస్తకాలూ, అంత కరీదూనూ - ఏటో అంతా గందరగోళంగా ఉంది".

"మరేటి సేద్దాం" సాలోచనగా అంది పిచ్చమ్మ.

"మన ఈరిగాడేం సెప్పినాడో తెలుసా? సదువుకున్నాళ్ళు కూడా, ఉద్దేగాలు దొరకక సత్తన్నారంట. ఏదో అల్లకి తెలిసినవాళ్లు నేకపోతే ఏ ఉద్దోగమూ రాదంట. ఆడూ, ఈడికి సదువెందుకురా, సుబ్బరంగా అడుక్కుతినటం నేర్పు అన్నాడు. నాకూ అదే మంచిదనిపిస్తావుందే పిచ్చమ్మా" చివరి మాట మెల్లగా అన్నాడు చింపిరాయి.

పిచ్చమ్మ గాభరాగా చూసింది.

"వద్దు మావా, వద్దు!" అన్నది గాభరాగా.

అదోలా నవ్వాడు చింపిరాయి.

"ఇదో పిచ్చమ్మా! మనది కింద నోకమే. గొప్పోళ్ళ నోకం మీదుంటుంది. దాన్నందుకోటానికి ప్రయత్నం సేయటం బుద్ధితక్కువే. మన పిల్లవాడు ముష్టివాడి కొడుకు. వాడలా బతకాలసిందే. ఆడికి ఓపికుంటే పని దొరికితే కూలో నాలో సేసుకొంటాడు. అది దొరక్కపోతే, ఆడి బాబు సేసిన పనే ఆడూ సేత్తాడు. అదేమీ తప్పు కాదే. నోక సకజమే. మనలాటోళ్ళు పై కెగరదామనుకోకూడదే పిచ్చమ్మా! కింద పడుతాం. అంతేనే".

అప్పుడే దేవుడు వచ్చాడు చింపిరాయి దగ్గరకు. వాళ్ళ అయ్యవేపు చూస్తూ అడిగాడు.

"అయితే నేనూ ముట్టెత్తుకోనా అయ్యా".